# చెలియలికట్ట

డ్రాయింగ్ రూమ్ మధ్య టీపాయ్ మీద సీసాలున్నాయి. ఒక సీసాలో ద్రవం గ్లాసులో ఒంపుకుంటూ ''హావ్ సమ్ డ్రింక్, లీలా! గివ్ అజ్ కంపెనీ!'' అన్నాడు వినోద్ లీల వేపు ఆహ్వానం నింపిన చూపులు చూస్తూ. తెల్లటి మొహంలో అందంగా మీసాలు.... చక్కని మగవాడు అనిపిస్తూ అతడు.....

తల అడ్డంగా ఊపింది లీల... అతడిని చూస్తూనే...

సోఫా వెనక్కి చేరబడిన తీరులో విలాసం వుంది.

షిఫాన్ చీరలోంచి శిల్పం చెక్కినట్లు కన్పిస్తున్న చంద్రబింబంలా ఆ చీరలో... నీటి పైకి వచ్చి విచ్చుకున్న కలువలా...

భుజాలదాకా విరబోసుకుని చెంపల్ని, నుదుటిని తాకుతున్న జుట్టుతో లిప్ స్టిక్ పూసిన పెదవులు, నుదుట ఎర్రటి బొట్టుతో కోరికల మంటలాగ.... తల అడ్డంగా ఊపింది లీల.

''డోంట్ ప్రెస్ హర్, మై బోయ్. మనిషి స్వతంత్రాన్ని హర్షిస్తాను నేను.'' అన్నాడు నవ్వుతూ హరి.

''మన ఆడవాళ్ళని బలవంతం చెయ్యకపోతే లాభం లేదు. వాళ్ళంతట వాళ్ళే పైకి లేచే చైతన్యం ఆ విత్తనంలో లేదు. వాళ్ళూ మనుషులే. వాళ్ళకి చదువు కావాలి. పౌష్టికాహారం తినాలి అని చెప్పటానికి రాజా రామమోహనరాయ్, వీరేశలింగం కావలసి వచ్చారు. వాళ్ళకి పిల్లల్ని కనే బాధ్యతే గాక ప్రేమించే హక్కు ఉంది అని చెప్పటానికి చలం పుట్టాల్సి వచ్చింది. ఇప్పటికీ, చదువుకుని ఉద్యోగాలు చేస్తున్నారు కూడా.

ప్రేమించటమంటే భయం! పెళ్ళి పేరు చెబితే చాలు ఎంత మోసంలోనైనా ఈజీగా దిగిపోతారు.'' ఫెళ్ళుమని చప్పుడు చేస్తూ నవ్వాడు వినోద్.

లీల కళ్ళు కెరటాలు లేచిపడినట్లు కదలాడాయి.

''పెళ్ళి చేసుకోటం తప్పా? నువ్వసలు పెళ్ళెందుకు చేసుకోలేదూ! పిరికితనం. ఉట్టి కబుర్లు చెప్తావు. డబ్బు, ఆరోగ్యం వుండి నీ యిష్టం వచ్చినట్లు లైఫ్ ఎన్జాయ్ చెయ్యటం గొప్ప! అదృష్టమే. ఈ ఆధునిక ప్రపంచం మనిషికి అటువంటి జీవితం సమకూర్చటానికి కృషి చేస్తోంది. కానీ నీకు నచ్చిన ఒక స్త్రీతో, ఆ ఆకర్షణ నీచి తప్పించుకోలేని వ్యక్తితో ఒక బంధానికి లోబడి నీ బ్రతుకును శ్రుతి చేస్తూ జీవనరాగం ఆలపించటం, విశ్వగానంతో నీ గానం లయం చేస్తూ ఒక క్లైమాక్స్‌ను అందుకోవటం ఇంకా గొప్ప విషయం. ఉన్నతమైన అనుభవం పొందగలగటం ఎంత గొప్ప అనుభవమో, చేతులు జాపి పొందలేకపోవటం కూడా అంతటి గొప్ప అనుభవమే. అనుభవించి తీరాల్సిన అనుభవాలు!'' అంది.

''కవిత్వం కవిత్వం'' అన్నాడు వినోద్.

''కోతలు కాదు. సౌందర్యారాధన, ఆనందాన్వేషణ, కవితావేశం, అన్నీ మనిషి సత్యాన్వేషణలో భాగాలే. నువ్వు అందాలు రేకెత్తించే ఆనందానికి దాసుడవై అనుభవానికి పట్టం కడతావు. కొందరు మానవత్వంలోని బలహీనత, ఔన్నత్యాన్ని కలనేసిన, అనూహ్యమైన కొలతల్ని గలిగిన జీవితాన్ని చూసి అద్భుతంలో, ఆశ్చర్యంలో మునిగిపోతారు. ఆలోచనలో పడిపోతారు.''

''ఆలోచించటం దండగ. అనుభవించటమే పరమార్థం.''

''ఆలోచించి అర్థం చేసుకోవటం చెప్పలేని ఆనందాన్ని యిస్తుంది. వెలుగుని నింపుతుంది. అనుభవం కంటె ఎక్కువ.'' అంది లీల.

''నువ్వు లీలని ఒప్పించలేవు.'' హరి నవ్వాడు వినోద్‌ని చూస్తూ.

''భర్తవు గనుక నువ్వు తేలికగా ఓటమి ఒప్పుకుంటున్నావ్ .... ఛాన్సెస్ దొరకవని భయపడి. కానీ నేను ఊరుకోను. ఐల్ ట్రై ...ఐల్ ట్రై ... నా కెందుకు భయం!'' అన్నాడు వినోద్.

''పసుపు రంగు పూల విత్తనంలోంచి ఎర్రపూలు పూయించలేవు! నిండుగా ప్రవహించే నది చేత చిరుగంతులు వేయించలేవు.

నవ్వింది లీల, కళ్ళలో కొంటెతనం.

లేవు... లేవు... చెయ్యలేవు... ఛాలెంజ్!

మస్తిష్కంలో పుట్టిన వుద్రేకం శరీరానికి సరఫరా అవుతోంది. లీలమీద కోరిక పెరుగుతోంది.

''కవిత్వం! కవిత్వం!'' అన్నాడు వినోద్ కసిగా.

''లీలకి పాటలు వచ్చు.'' అన్నాడు హరి మురిపెంగా.

హరి సూట్ కేస్ సర్దుకుంటున్నాడు. కంపెనీ పని మీద అతడు తరచూ టూర్ చేస్తుంటాడు. లీల బెడ్ మీద కూర్చుని అతడి కదలికల్ని చూస్తోంది. అతడు ఒక్కడే ఎక్కడికి వెళ్ళినా అతడే సర్దుకుంటాడు బట్టలూ, వస్తువులూ. లీల సర్దదు. ఇద్దరూ కలిసి వెళ్ళినప్పుడు మాత్రం లీల సర్దుతుంది.

''క రోజులో సగం పగలూ, సగం రాత్రి. పాటలో ఒక ఆరోహణ. ఒక అవరోహణ.

సముద్రంలో వచ్చే కెరటం, పోయే కెరటం.

అవే పెదవుల మీద నవ్వొక సారి, ఏడుపొక సారి.'' అంది లీల.

''పాట పాడుతున్నావా లీలా!'' తలెత్తి అడిగాడు హరి.

''కాదు నా జీవితం వినిపిస్తున్నాను.'' అంది.

చేస్తున్న పని వదిలి వచ్చి పక్కనే కూర్చున్నాడు.

''నువ్వు ఇట్లాగ ఉంటే నేను వెళ్ళలేను.'' అన్నాడు పెదవులతో లీల బుగ్గను స్పృశిస్తూ.

ప్రతి సారీ ఈ సీను తప్పదు.

''ఉహూ. మీరు వెళ్ళాలి. ఈ ఉద్యోగం కాకుండా మీరు మామూలు ఉద్యోగం లో ఉన్నారనుకోండి! విసుక్కుంటాను. రోజంతా నా యెదురుగా కూర్చుంటే.... చీటికి మాటికి కాఫీ.. టవలు... అంటుంటే మీరీ ఉద్యోగం చేస్తున్నారని నాకు ద్వేషం లేదు. ఈ ప్రపంచంలో ఎన్నో రకాల వృత్తులు జరగాలి ప్రతి రోజూ. మనకి దొరికినదానికి ఎడ్జస్టు అవ్వాలి మనం. దీనిలో వున్న కష్ట సుఖాల్ని వినిపిస్తున్నానంతే. నిరసించటంలేదు.'' అంది లీల.

''మై స్వీట్ లీలా!'' అతడి చేతులు లీల చుట్టూ బిగుసుకున్నాయి.

మంచి యిల్లు, కారు, చీరలు, నగలు, ఇద్దరు పిల్లలు. మధ్య అనురాగ స్రవంతి ఉన్నాయి కానీ ఈ ఎడబాటు తప్పదు నెలకొక సారి.

''తిరిగి వస్తాడా? మళ్ళీ చూస్తానా! ఈ సుఖానికివే ఆఖరి ఘడియలా! ప్లేన్ క్రాష్‌లు, ట్రైన్ దిరెయిల్‌మెంటులూ తప్పించుకుని తిరిగి వస్తాడా? మళ్ళీ చూడలేను అన్న తలపు మనసుని తలుపు సందులో పెట్టి నొక్కుతున్నట్లు, కడుపులో భూకంపం వచ్చినట్లు.... బాధ.... బాధ.... ఊహు, ధైర్యం తెచ్చుకోవాలి. అతడెందుకు రాడు! తప్పకుండా తిరిగి వస్తాడు. మొహాన ఎట్లాగ రాసుంటే అట్లాగ జరుగుతుంది. ఏడు సముద్రాలు దాటినా రాజకుమారుడి లాగా వచ్చేస్తాడు'' లీల అనుకుంటోంది.

క్రింది నించి కారు హారన్ వాళ్ళకు వినిపించలేదు. రెండు నిమిషాల్లో వినోద్ పైకి వచ్చాడు. హరి చేతులలో లీల. మెల్లిగా విడిపించుకుంటోంది అతడిని చూసి. ''ఇంకా పూర్తి కాలేదా ఫార్మాలిటీస్!'' అన్నాడు వినోద్ నవ్వుతూ.

''ఈ విషయాలలో నీ కనుభవం లేదు ఊరుకో వినోద్! బెంగ పెట్టుకోకు లీలా. హాయిగా గడిపెయ్. వినోద్‌కి చెప్పు ఏం కావాల్సినా. వస్తా స్వీటీ...'' అన్నాడు హరి. గట్టి తాడుతో బలంగా లాగుతున్నట్లున్న కనిపించని బంధం ఇద్దరి మధ్య. వరండాలోకి వచ్చి చెయ్యి ఊపింది కారు కదులుతుంటే.

మనసు మూగబోతూంది. కళ్ళు పొడిగానే ఉంటాయి. మనసు పొరల్లో విషాదరాగం ఆలాపన. పది రోజులు మౌన వ్రతం. ఏకాంత యోగం. అజ్ఞాత వాసం. తరవాత హరి వస్తాడు.

తొలకరి మేఘపు గర్జన లాగ.

వాన కురిసిన రాత్రి తరవాత సూర్యోదయంలాగ తనలో సరి కొత్త చైతన్యం. అప్పటి దాకా కాలాన్ని గడపటానికి శరణు జొచ్చిన మగత నిద్రలో తను. కారు కదలి వెంటనే ఆగింది. ఏమైందోనని చూస్తోంది లీల. వినోద్ పైకి వచ్చాడు.

''ఫైల్ మరిచిపోయాను. అట్లాగ చూస్తున్నావేం! భయం వేస్తోందా ఎందుకొచ్చానో అని? సాయంత్రం వస్తా. బీచ్‌కి వెడదాం'' అన్నాడు. వెళ్ళిపోయాడు.

అతడు హరిని ఎయిర్ పోర్ట్‌లో దింపి ఆఫీసుకు వెడతాడు. సాయంత్రం వస్తాడుట. కేదార్‌నాథ్‌లో ఆరు నెలలు మంచు కప్పబడినా, ఆ గుహలో జ్యోతి ఆరకుండా వెలుగుతుందిట. దానికి సైంటిఫిక్ ఎక్స్‌ప్లనేషన్ ఏమిటో!

* * * *

బెడ్ పక్కన డ్రెస్సింగ్ టేబుల్ మీద నాలుగు ఉత్తరాలు పడి ఉన్నాయి.

ఆ నాలుగూ వినోద్ లీలకి రాసిన ప్రేమ లేఖలు.

లీల పడుకుని ఆ ఉత్తరాలు మళ్ళీ చదువుతోంది.

ప్రేమను గురించే ఘాటుగా రాశాడు. బెదిరుస్తూ రాశాడు. లాలిస్తూ రాశాడు. లీలను వర్ణిస్తూ రాశాడు.

హరికి చేతకాదు అట్లాగ మాట్లాడతం, రాయటం.

వినోద్ చాలా చక్కటి ఇంగ్లీషు రాస్తాడు. తెలుగు కవుల్ని కోట్ చేస్తాడు.

వినోద్ ఆ వాక్యాలు ఉచ్చరిస్తే....

అక్షరాలకి శబ్దం పోస్తే ఇంత ఆనందం సృష్టి కాగలదా అని ఆశ్చర్యం కలుగుతుంది. హరి సన్నగా పొడుగ్గా బ్రౌన్ కలర్‌లో ఉంటాడు.

వినోద్ అంత పొడుగు కాదు. తగిన లావు. మంచి రంగు. స్మార్ట్‌గా కనిపిమచే లాగా డ్రెస్ చేసుకుంటాడు. ఆ వేషానికి తగిన హుషారు. మనసును ఆడిస్తాడు.

అతడి చూపులు మనసులో గుచ్చుకుపోతాయి. మరపు రాకుండా.

అతడి నవ్వు పూలజల్లులా తాకుతుంది మత్తు కలిగిస్తూ.

అతడి చొరవ చకితపరుస్తుంది తప్పుకోలేని విధంగా.

ఈ వినోద్‌ని కాదని అన గల శక్తి తనకి యెక్కడనించి వస్తోంది?

హరిమీద తనకి గల ప్రేమా?

భార్యగా అది తన ధర్మమా?

సంఘ వ్యతిరేకమని భయమా?

దేనికెంత శక్తి వుందో తను తేల్చుకోలేదు గానీ.... హరి తనకి తెలుసు.... అతడు అట్లాగే వున్నంత కాలం... అతడున్నంత కాలం తనకి ఇంకెవరూ కన్పించరు.

నెల నించి... కాదు.... వినోద్ మొదటి అడుగు వేసి,

''ప్రతి రోజూ ఒక కొత్త ఆశతో ఉదయం అవతరిస్తుంది. ప్రతి గులాబికి తనదైన ఒక అందం వుంటుంది.

నీతో నా పరిచయం, నా ప్రేమ జీవితంలో ఒక సరి కొత్త మలుపు. నా జీవితంలో మరువరాని ఒక మంచి రోజు.

ఎంతోమందిలో ఎన్నో అనుభవాలు నేను రుచి చూసినా నాకు బంగారు సంకెళ్ళు వేస్తున్న నీ అందాన్ని దోచుకోకపోతే అది నాకు ఆత్మ హత్యతో సమాన మవుతుంది.

ఎందరికో ఆనందపు రెక్కలు తొడిగి స్వర్గ సీమలకు తీసికెళ్ళాను. నిన్ను

స్వర్గంలో సింహాసనం మీద కూర్చోబెట్టి నీకు ప్రేమ కిరీటం కొడగకపోతే న జన్మే వ్యర్థమవుతుంది''.... అంటూ తన ప్రేమని ప్రకటించినప్పటి నుంచీ .... ఆర్నెల్ల నించీ ఆలోచిస్తోంది.

ఆరు నెలలు! .... చాలా కాలం ఊరుకుంది. వారికి చెప్పటమా, వద్దా? అనే ఆలోచన తెమలలేదు. ఇద్దరి మధ్యా రహస్యాలుండ కూడదు అని చెప్దా మనుకుంది. అతడు తప్పని సరిగా నెలకి పది రోజులు ఇంట్లో ఉండడు. ఈ విషయం తెలిస్తే అతడు ఈ ఉద్యోగం చెయ్యలేడు. ఉంటున్నది సిటీలో. నెలకి రెండు వేలు వస్తోంది.

ఇంటి అద్దె, ఇద్దరు పిల్లలు, స్టేటస్ మెయిన్‌టెయిన్ చెయ్యటం, ఖర్చులు గడిచిపోతున్నాయి ఇబ్బందులు' లేకుండా.

ఈ ఉద్యోగం వదిలేస్తే ఇంకో ఉద్యోగం ఎప్పటికి దొరుకుతుందో!

ఈ పిల్లలతో తను ఉద్యోగం చెయ్యలేదు. కష్టపడి చేసినా ఎంత వస్తుందని!

''వినోద్ నన్ను ప్రేమిస్తున్నానంటున్నాడు.'' అని హరితో చెప్పి అతడి మన శ్శిమితం పోగొట్ట కూడదు. ఈ నాగరిక ప్రపంచంలో ఈ వినోద్ కాకపోతే మరొక మోహన్ వుంటూనే వుంటాడు. ఏమిటి చెయ్యటం?

మనిషి రేషనల్ ఆనిమల్.

''ఈ సమస్య నా సమస్య. నేనే పరిష్కరించుకోవాలి. ప్రయత్నిస్తాను.'' అనుకుంది.

* * * *

సాయంత్రం పిల్లల్ని తయారు చేసి తను కూడా ముస్తాబయింది లీల.

వినోద్ వచ్చాడు. పిల్లలు సంతోషంగా కారు ఎక్కారు. తల్లితోబాటు. కారు బీచ్‌లో ఆగింది. పిల్లలు పరిగెత్తుకుంటూ వెళ్ళారు. ఆడుకోటానికి.

సముద్రం వైపు నడిచారు వినోద్, లీల.

కెరటాలు తడిపేంత దగ్గరకు రానంత దూరంలో ఆగింది లీల. అక్కడ కూర్చుంది.

వినోద్ పక్కనే కూర్చున్నాడు. కళ్ళలో లాలస లాస్యం చేస్తోంది. పెదవులు నవ్వుకుంటున్నాయి. ఇసుకలో చెయ్యి ఆన్చుకుంది లీల సముద్రాన్ని చూస్తూ.

ఆ చేతిమీద చేయి వేస్తూ, ''నాకోసం ఇంత చక్కగా అలంకరించుకున్నందుకు థ్యాంక్స్. నీ పక్కన నడుస్తూంటే గర్వంగా వుంది'' అన్నాడు.

''నేనెప్పుడూ చక్కగానే అలంకరించుకుంటాను ప్రతి సాయంత్రం. అంతే

గాని 'సే ఇట్ విత్ యువర్ డ్రెస్' అని నీకోసం అనుకోకు. మనిషి వేషాన్ని బట్టి మనసు అంచనా వెయ్యకు. నీ మనసుని తప్పు దోవలో పరిగెత్తించకు.'' అంది.

''అవును, ప్రతి సాయంత్రం నువ్వు చాలా ఫ్రెష్‌గా కనిపిస్తావు. కానీ ఇవాళ నీ అలంకరణ నాకోసం అనుకోటంలో నాకెంతో హాయి ఉంది. అల్లాగే అనుకుంటాను నేను.'' అన్నాడు నవ్వుతూ.

''నీ మనసులో ఉన్నంత వరకూ... నీ మనసులో ఏమైనా అనుకో గల స్వతంత్రం నీకు ఉంది కానీ, నీ ఆలోచన పెదవి దాటి మాట ఐనప్పుడు నీకు ఆ స్వతంత్రం లేదు. ఎదుటి మనిషి గురించి ఆలోచించాల్సిన బాధ్యత నీమీద ఉంది.'' అంది లీల నవ్వుతూ.

''నీ గురించి నీకు తెలియదేమో కానీ నాకు బాగా తెలుసు లీలా! నువ్వు భయపడుతున్నావు. నువ్వింకా సంప్రదాయపు ముసుగులోంచి బయటకు రాలేదు. ఆ ముసుగు వదిలి ముందుకు ఒక అడుగు వేస్తే... నువ్వు సీతాకోకచిలుక వైపోతావు. నీకు ఈ లోకం అద్భుతంగా మారి కనిపిస్తుంది. సుఖమనేదే తప్ప తప్పు అనేది ఏదీ ఈ లోకంలో లేదు అని నీకు తెలుస్తుంది... ఒక్క అడుగు ముందుకి! అంతే.'' వినోద్ ఉత్సాహంగా చెప్తున్నాడు. లీలని ఒప్పించాలని పట్టుదల చోటు చేసుకుంటోంది అతడిలో. లీల అతడి మాటలు శ్రద్ధగా వింది.

''ఒక్క అడుగు ముందుకి!'' అంది సముద్రం వైపు చూస్తూ. పగలు గడిచి రాత్రి సమీపించిన వేళ. వ్యభిచార భావాలకి స్వస్తి చెప్పి శాంతిని పొందటానికి పూనుకున్నట్లు సముద్రపు గమనంలో ఒక మార్పు కనిపిస్తోంది.

''ఆలస్యం చెయ్యటంతో తమకం పెరుగుతుందన్న మాట నిజమే. ఇప్పటికైనా వొప్పుకున్నందుకు నాకు ఆనందంగా వుంది లీలా.''

లీల చేతిని అందుకుని అరచేయిలో ముద్దు పెట్టుకున్నాడు.

''నేను వొప్పుకున్నానా? దేనికి?'' అంది లీల అతడిని సూటిగా చూస్తూ.

''ఔను. ఒప్పుకున్నావు. నీ ప్రేమను నాకు పంచిపెట్టటానికి దయతో వొప్పుకున్నావు. నేను మాత్రం వూరుకుంటా ననుకున్నావా? నీదగ్గర నుంచి ఎంత తీసుకుంటానో అంత మధురానుభవం తిరిగి నీకు యిస్తాను. బాకీ వుంచటం నాకు అలవాటు లేదు.'' నవ్వుతూ లీల చేతిని మెల్లగా లాగాడు.

ఏమరిపాటుగా వుంటే ఆ తాకిడికి లీల అతడిమీద పడవలసింది. లీల కదలలేదు.

"ఒప్పుకున్నానా!" అంది రెట్టిస్తూ.

"ఒప్పుకున్నావు. ఎన్ని సార్లు పిలిచినా హరి ఊరెళ్ళినప్పుడు రాలేదు నాతో. ఇవేళ వచ్చావు!" ప్రార్థనా పూర్వకంగా ఉన్నాయి అతడి మాటలు, చూపులూ.

"ఔను వచ్చాను నీకు జవాబివ్వటానికి" అని ఆగి మళ్ళీ చెప్పటం మొదలుపెట్టింది.

"నా కంటే అందమైన వాళ్ళనే నువ్వు చూశావు. చూస్తున్నావు. అయినా నీ కోరిక నామీద పరుగెత్తుతోందంటే? ఇన్నాళ్ళూ నీకేమని జవాబివ్వాలో, ఎట్లా జవాబివ్వాలో నని ఆలోచిస్తున్నాను. అసలు ఇంత టైమ్ అవసరం లేదు. ఈ విషయంలో నాకు రెండో అభిప్రాయమేమీ లేదు కనుక. కానీ నువ్వంటే నాకు ఇష్టం, అభిమానం. నిన్ను నొప్పించటం నాకు కష్టంగా వుంటుంది. నువ్వు నన్ను ఎంతగా నొప్పిస్తున్నా సరే. నువ్వు నాకు ఉత్తరాలు రాశావు. ఎన్నో ప్రశ్నలు వేశావు. అన్నిటికీ జవాబిస్తాను నేను.

పూర్తిగా నన్ను మాట్లాడనీ. మధ్యలో అడ్డు రాకు. నా కంటె అందమైన వాళ్ళనే చూస్తున్నావ్. ఐనా నీ కోరిక నా మీద పరుగెత్తుతోందంటే.... అందకపోవటమే కారణమా? అందితే నేను అందరి లాంటి దాన్నే కదూ!"

"కాదు." అన్నాడు వినోద్. "ఉండు అడ్డు రాకు. నన్ను చెప్పనీ" అంది లీల. వినోద్ వింటున్నాడు.

"హరి నా కంటె ఏ విషయంలో అధికుడూ! కేవలం భర్త అనే కదూ ఇష్టం. లోబడి వుంటావు. నా కోరిక తీర్చటానికి భయపడతావూ— అన్నావు నువ్వు.

ఔను. హరి నాకు భర్త. నన్ను పెళ్ళి చేసుకున్నాడు. అంటే నన్ను నమ్ముకున్నాడు. నేను అట్లాగే నమ్ముకున్నాను. మా ఇద్దరి మధ్యా ఈ బంధం ఉంది.

తుమ్మెదకి, పూవుకి ఏ బంధం లేదు. మధువు గ్రోలి వెళ్ళిపోతుంది. సృష్టి కార్యం నెరవేరుతుంది. మనిషి జన్మ వేరు. మనిషి చట్టూ ఒక మనోమయ ప్రపంచం అల్లుకుని ఉంటుంది. మమత, అనురాగం, ద్వేషం, కృతజ్ఞత మొదలైన బంధాలు ఏర్పడుతున్నాయి. ఈ మమతానురాగాలు లేని జంతు స్వేచ్ఛ నాకు వద్దు. అదే కోరుకుని వుంటే నేనూ నీ లాగ పెళ్ళి చేసుకునివుండేదాన్ని కాదు. నేనే కాదు మనుషులు పిచ్చివాళ్ళు కాదు. మనిషికి ఈ స్వేచ్ఛ ఇచ్చే ఆనందం కంటే జీవితంలో కావలసిన తృప్తి నొకదానిని పెళ్ళి ఇవ్వగలదు కనకనే అందరూ పెళ్ళి చేసుకుంటారు.

ఈ బందాలని తెంచుకుని యెదగాలని, స్వేచ్ఛని కలిగివుండటమే నాగరిక జీవితానికి పరాకాష్ఠ అన్నావు. జీవించటానికి కావలసిన సుఖాలన్నీ వుండి ఎంతో

శృంగార జీవితాన్ని గడుపుతున్న మెర్లిన్ మన్రో యెందుకు ఆత్మహత్య చేసుకుంది? అటువంటి స్వేచ్ఛ కలిగి వుండి లిబరేటెడ్ వుమన్ అనిపించుకున్న పర్వీన్ బాబీకి 'పగిలిన హృదయం' అనే జబ్బు యెందుకు వచ్చింది?

మమకారం, మమత లేని హృదయం శూన్యంగా వుంటుంది. ఈ శూన్యాన్ని మనిషి భరించలేడు. అందుకే ప్రేమిస్తారు. ఒక బంధానికి లోబడి బాధ్యతలు నెరవేర్చటంలో ఉన్న తృప్తి, నీ కోరికలు తీర్చుకోవటంలో దొరకదు. అందుకే పెళ్ళి చేసుకుంటారు.

ఒక్క అడుగు ముందుకు వేస్తే అంతా ఆనందమే సీతాకోక చిలుకవై పోతానన్నావు ఫ్రీ లవ్ తప్పు కాదంటున్నావు. నాకూ తెలుసు ఇవన్నీ మనుషులు ఏర్పాటు చేసుకున్న నిబంధనలని. కానీ అవి ఎవరి కోసం చేశారు?

మన కోసమే. మనిషి సంఘంతో ఘర్షణ లేకుండా శాంతి యుతంగా జీవించాలని! మనిషి స్వభావానికి అనుగుణంగానే చేశారు.

జత కట్టటం మనిషికి ఎవరూ నేర్పించలేదు. అది పుట్టుకతో వచ్చిన బుద్ధి. మనిషి స్వార్థపరుడే కానీ 'తన వాళ్ళ' కోసం ఎంత త్యాగమైనా చెయ్యగలిగిన శక్తి గలిగి వుంటాడు. అందుకే ఇంకొకరి కోసం బ్రతకటంలో అంత ఆనందం. అసలు తప్పు అనేది ఏమిటి? తప్పు అనేది లేదు. కాని బాధ వుంది!

హరి ఇంకో స్త్రీని ప్రేమిస్తాడు అని ఊహిస్తేనే నాకెందుకింత బాధగా వుంటుంది! జీవించడం అనవసరమనిపిస్తుంది.

ఈ బాధ యెక్కడనుంచి పుడుతోందో నువ్వు చెప్పగలవా?

హరిని ఇటువంటి బాధకి గురి చెయ్యలేను నేను.

కొందరు స్త్రీలు భర్త మీద కోపంతో కసి కొద్దీ వ్యభిచరిస్తారుట.

హరి యెటువంటి వాడైనా సరే. నేను మాత్రం ఆ పని చెయ్యలేను. కానీ అందరూ నాలాగే వుండరు.

కొందరు నీలిమ లాంటి వాళ్ళు కూడా వుంటారు.

నీతో సమంగా తాగి 'ఒరేయ్ విన్నూ' అనగలవాళ్ళు, నువ్వు ఒసేయ్ నీలూ అన్నా బాధపడనివాళ్ళు– నీకు అటువంటివాళ్ళు సరిపోతారు. నన్నెందుకు బాధ పెడతావు?

మనిద్దరి మధ్య సంగతి ఎవరికీ తెలియదు, తెలియనవసరం లేదన్నావు. కానీ నాకు తెలుసు కదూ? అనంతమైన ఈ సృష్టిలో మనిషి ఒక ఇసుక రేణువే కావచ్చు. కానీ ఆ మనిషి అంతరంగంలో అణువంత పాపమైనా, పుణ్యమైనా సరే విశ్వరూపం దాలుస్తుంది.

నీ చేతులలో నలిగిన దేహంతో హరి ముందర ఏమీ ఎరగనట్లు నిలవలేను. దాచలేను పెళ్ళికి ముందర ఎవరికి ఎవరమో! ఏమీ కాము.

కానీ పెళ్ళి అయ్యాక అతడు నాలో ఒక భాగం, నేను అతడిలో ఒక భాగాన్ని. ఆ భాగాన్ని నెగ్లెక్ట్ చెయ్యలేను. అతడికి దుఃఖం కలిగించలేను. అతడు బాధపడు తుంటే చూడలేను. అతడిని సంతోష పరచటమే నాకు గర్వకారణమౌతుంది.

ప్రేమించటమంటే భయం అన్నావు.

కాదు. కామమంటే భయం.

బాధ్యత తెలియని కామమంటే భయం. స్వార్థం మాత్రమే చూసుకునే కామమంటే అసహ్యం. ప్రేమతో ముడి వేసుకునే పెళ్ళి అంటే గౌరవం, ఆరాధన! పెళ్ళి చేసుకున్నవాడంటే పరవశత్వం, నమ్మకం, అర్పణ!

మీరు అనే ప్రేమని అర్థం కామం!

మేము ఎదురుచూసే పెళ్ళికి అర్థం ప్రేమ!

చివరికి నువ్వు– ఐ కెన్ పాయిజన్ హిమ్ ఈజిలీ, ఐ కెన్ కిల్ హిమ్ ఇన్ ఏన్ యాక్సిడెంట్– అని బెదిరించావు.

నా కోసం ఏమైనా చేస్తానన్నావు. సంతోషించమంటావా?

అంతా చేయగల సమర్థుడవే నువ్వు.

ఏ పరిస్థితిలోనైనా హరి ''డెత్''ని అంగీకరించలేను నేను.

అతడు పిల్లలు సుఖంగా వుండాలని, బ్రతికి వుండాలని కోరుకుంటాను నేను.

అందుకని నీ కోరికని అంగీకరిస్తాను.

హరికి విడాకులిస్తాను.

నన్ను నలుగురి ఎదుట పెళ్ళిచేసుకుంటావా? నీ ఇంటికి తీసికెడతావా? నాకు పై పై ఆకర్షణ చాలదు. మనిషినీ మనిషినీ కట్టివేసే అనుబంధం ఉండాలి. నమ్మకం కావాలి.

నీ స్వభావాన్ని బట్టి నీకు కొద్ది కాలంలోనే నా మీద ఆకర్షణ పోతుంది.

అప్పుడు నేను ఏం చూసుకుని బ్రతకాలి? నాకు ఆత్మహత్య తప్పదు.

ఐనా నీ దగ్గరికి వచ్చేస్తాను. హరి బ్రతికి ఉండటం కోసం.

చెప్పుమరి రమ్మంటావా? హరికి విడాకులు యిమ్మంటావా? లేచి రమ్మంటావా?

లీల కళ్ళలో నీళ్ళు వచ్చేశాయి.

వినోద్ మాట్లాడకుండానే విన్నాడు. లీలనే చూస్తున్నాడు.

తనలో మోహం మంచు లాగ పేరుకుపోయింది. హృదయం అడుగున పడిపోయింది. లీల మాటలు సూర్య కిరణాల్లాగ వాడిగా, వేడిగా కోసేస్తున్నాయి మంచుని. మంచు అంతా కరిగిపోతోంది. హృదయం చైతన్యం పొందుతోంది. సుఖాల్ని మించి 'ఏదో' వుంది అనిపిస్తోంది.

లీలను చూస్తుంటే అయస్కాంతం లాగినట్లు ఆకర్షణ కలగడం లేదు ఇదివరకు లాగ. దాని స్థానంలో కోరికల వాసన లేని ఇష్టం పుడుతోంది. ఆరాధన లాంటి భావం కలుగుతోంది.

''ఐస్ క్రీం'' కేకతో ఉలిక్కిపడ్డాడు. ఈ లోకంలోకి వచ్చాడు. దూరంగా పిల్లలు వస్తున్నారు. బరువుగా ఊపిరి వదిలాడు. ''ఐస్ క్రీం తిందామా లీలా?'' అడిగాడు.

లీల తల ఊపింది.

పిల్లలు నవ్వుతూ కబుర్లు చెప్తూ ఐస్ క్రీమ్ తింటున్నారు.

వినోద్ తినటం ఆపి 'లీలా!' అన్నాడు.

లీల అతడి వైపు చూసింది. జవాబు కోసం నరీక్షిస్తున్నట్లు.

''నీ ఆలోచనల వాడి నా గుండెలో మంచుని కరిగించింది. నీ కళ్ళలో తడి నాలో ఆరిన దీపాల్ని వెలిగించింది. నా ప్రవర్తనలో మార్పు వుండకపోవచ్చు. నీలిమల సావాసంలోనే నా బ్రతుకు ముగిసిపోవచ్చు. కానీ నీ పరిచయంతో నా అనుభవాల పరిధి పెరిగింది. ఆలోచన కూడా ఒక అపురూపమైన అనుభవమే'' అన్నాడు వినోద్.

తినేసిన కప్పుని దూరంగా విసిరేసింది లీల. వినోద్ లేచి నుంచున్నాడు. పిల్లలిద్దరినీ చెరొక చేత్తో పట్టుకున్నాడు.

''లే. ఇంక పోదాం. నిన్ను జాగ్రత్తగా ఇంటి దగ్గర దింపకపోతే హరి నా చర్మం వొలిచేస్తాడు.'' అన్నాడు నవ్వుతూ.

లీల లేచింది. అందరూ కలసి కారు దగ్గరికి వెడుతున్నారు.

''నిన్ను భాబీ అని పిలవాలనిపిస్తోంది.'' అన్నాడు వినోద్.

''అట్లాగే పిలు.'' అంది లీల నవ్వి.

సముద్రం దూరమౌతోంది.

అంత పెద్ద సముద్రం చెలియలి కట్ట దాటి రాలేకపోతోంది. సముద్రం కూడా రేషనల్ ఆనిమల్ కాబోలు! లీల నవ్వుకుంటోంది.

* * * *